క్లుప్తంగా

భగవంతుని సేవతో సకలం సాధ్యం



స్వామీజీని సత్కరిస్తున్న యాతగిరి పరశురామ్

బోట్‌క్లబ్‌: మధ్వాచార్య మూల మహాసంస్థాన ఉత్తరాది మఠాధీశులు సత్యాత్మతీర్థ స్వామిజీ మూడు రోజులు పర్యటన మంగళవారం ముగిసింది. స్థానిక జర్నలిస్ట్‌ కాలనీలో ఉన్న రమాసహిత సత్యదేవ దాసాంజనేయ మందిర ప్రాంగణంలో మఠ సంస్థాన పూజ నిర్వహించారు. స్వామిజీకి మందిర నిర్వాహకులు పరశురామ్‌ దంపతులు పాదపూజ చేశారు. స్వామిజీ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. నిత్యకర్మాచరణ ద్వారా భగవంతుని అనుగ్రహాన్ని పొందవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ సంధ్యావందనం చేయాలన్నారు. మహిళలు తులసి పూజ, గురమంత్ర పఠనం వంటివి క్రమం తప్పకుండా ఆచరించాలన్నారు. మఠ దివాన్‌ పండిత శశి ఆచార్‌, పండిత వాసుదేవాచార్‌, విజయసింహాచార్‌తో మధ్వసభ కమిటీ అధ్యక్షుడు రాచూరి రాఘవేంద్రస్వామి, కార్యదర్శి కోపెల్ల శేషగిరిరావు పాల్గొన్నారు.

స్త్రీ గౌరవంతోనే సంపూర్ణ సాధికారత

- కలెక్టర్‌ కృతికా శుక్లా
- జేఎన్‌టీయూకేలో మహిళా దినోత్సవం



కలెక్టర్‌ కృతికా శుక్లాను సత్కరిస్తున్న వీసీ డాక్టర్‌ ప్రసాదరాజు, సతీమణి అరుణ, డైరెక్టర్లు



వేదికపై మాట్లాడుతున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్త్రీలను గౌరవించినప్పుడే సంపూర్ణ మహిళ సాధికారిత సాధ్యమని కలెక్టర్‌ కృత్తికా శుక్లా పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో ఉమెన్‌ ఎంపవర్‌మెంట్‌ గ్రీవెన్స్‌ డైరక్టరేట్‌ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ మహిళలు తమ లక్ష్యం ఏర్పరచుకుని నిరంతరం శ్రమించి సాధించాలన్నారు. మహిళలు సైతం నిత్యం వ్యాయామం చేసేందుకు సమయం వెచ్చించాలని సూచించారు. వీసీ డాక్టర్‌ జీవీఆర్‌ ప్రసాదరాజు మాట్లాడుతూ వర్సిటీలో మహిళ సాధికారితకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అనంతరం ఐదుగురు సీనియర్‌ టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌ సిబ్బందిని సత్కరించారు. ముఖ్య అతిథి కలెక్టర్‌ కృత్తికా శుక్లాను వీసీ ప్రసాదరాజు, సతీమణి అరుణ, రెక్టార్‌ రమణ, రిజిస్ట్రార్‌ సుమలత ఆధ్వర్యంలో సత్కరించారు. టీచింగ్‌, నాన్‌టీచింగ్‌ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ నిర్దేశకులు మహిళలు

కాకినాడ రూరల్‌: నేటి సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య జీవీఆర్‌ ప్రసాదరాజు పేర్కొన్నారు. తిమ్మాపురం అచ్చంపేట జంక్షన్‌ వద్ద వర్సిటీ ఎంఎస్‌ఎన్‌ పీజీ సెంటర్‌లో ప్రిన్సిపాల్‌ కమలకుమారి అధ్యక్షతన మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. వీసీ ముఖ్యఅతిథి హాజరై మాట్లాడుతూ యువతులు ఉన్నతి స్థితికి చేరుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మరో అతిథి వర్సిటీ కౌన్సిల్‌ మెంబరు డాక్టరు జొన్నకూటి సునీత తన వ్యక్తిగత, వృత్తి జీవితంలో సాధించిన ఘనతలను వివరించారు. క్యాంపస్‌ మహిళా విభాగం సమన్వయకర్త డాక్టర్‌ అనిలాంబిక ఆధ్వర్యంలో బోధన, బోధనేతర సిబ్బందిని ఈ సందర్భంగా సత్కరించారు. రాధామాధవి ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టరు జోసెఫ్‌ స్టీఫెన్‌, డాక్టర్‌ హారిక, ప్రసాద్‌, మధుకుమార్‌, ఎం.సత్యనారాయణ, శ్రీరామరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నింటా రాణించాలి

కాకినాడ కల్చరల్‌: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కౌడా చైర్‌పర్సన్‌ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి అన్నారు. స్థానిక సాంబమూర్తినగర్‌లో ఇన్ర్టిగేటెడ్‌ హెల్పింగ్‌ మైండ్స్‌ అనుబంధ సంస్థ వనిత ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పారిశుధ్య కార్మికులను సత్కరించారు. మాజీ మేయర్‌ సుంకర శివప్రసన్న, సంస్థ డైరెక్టర్‌ గౌతమ్‌, డిప్యూటీ డైరెక్టర్‌ మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ



లావణ్యకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.రెండు లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మంగళవారం ఆయా కుటుంబాలకు అందజేశారు. 11వ డివిజన్‌కు చెందిన ఏడాదిన్నర చిన్నారి లివర్‌ సర్జరీ కోసం మంజూరైన రూ.1.2 లక్ష చెక్కును చిన్నారి తల్లి దేవాదుల లావణ్యకు అందజేశారు. అలాగే మరో సమస్యకు సంబంధించి కడలి మోహనరావు ఆరోగ్య ఖర్చుల నిమిత్తం అతని కుటుంబ సభ్యులకు రూ.75 వేలు చెక్కును అందజేశారు. వైఎస్సార్‌ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్‌ సుంకర శివప్రసన్న, మాజీ డిప్యూటీ మేయర్‌ పసుపులేటి వెంకటలక్ష్మి, పార్టీ నేతలు రాగిరెడ్డి సుబ్బారావు, శ్రీ యువసేన అధ్యక్షుడు వి.సతీష్‌ తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి: డీఈవో

కాకినాడ సిటీ: ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నట్లు డీఈఓ కేఎస్‌వీఎస్‌ అన్నపూర్ణ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పదో తరగతి పరీక్షల నిర్వహణ, సన్నద్ధతపై ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్‌ కమిషనర్‌ వి.రాజశేఖర్‌తో సమీక్షించారు. ఈ ఏడాది జిల్లాలో 29,988 మంది 136 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌ మూడో తేదీ నుంచి 18వ తేదీ వరకు పరీక్షలు ఉంటుందన్నారు. పదో తేదీన హెచ్‌ఎంలతో సమీక్షించనున్నట్లు తెలిపారు.

ఉప్పాలమ్మతల్లికి కుంకుమపూజలు

కరప: గ్రామదేవత ఉప్పాలమ్మతల్లి ఆలయంలో మంగళవారం ఆలయ పునర్నిర్మాణ కమిటీ కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామంలోని 136 మంది మహిళలతో వేదపండితుడు పురుషోత్తం శర్మ కుంకుమ పూజలు చేయించారు.

జాషువా ఎంపిక హర్షణీయం

కాకినాడ సిటీ: జిల్లా వైఎస్సార్‌ సీపీ మైనారిటీ సెల్‌ అధ్యక్షుడిగా దడాల జాషువా ఎంపికపై నేషనల్‌ క్రిస్టియన్‌ కౌన్సిల్‌ జిల్లా అధ్యక్షులు మోసా అబ్రహం, సిటీ రీజినల్‌ చైర్మన్‌ ఎం.ఇస్సాకు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలకు వారు అభినందనలు తెలిపారు. జాషువాను కలసి నేషనల్‌ క్రిస్టియన్‌ కౌన్సిల్‌ ప్రతినిధులు అభినందించారు.

ఆకాశంలో సగానికి స్ఫూర్తిగా..

ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి ఎగిరిందిట. వెటకారాల్లో సైతం ఆడదే కావలిసొచ్చింది నాటి తరానికి. నేటి తరం ఆ వెటకారాలను భరించే స్థితిలో లేదు. ఆకాశంలో సగం అనే నినాదం ప్రపంచ వ్యాప్తంగా నినాదాలకే పరిమితమవుతోంది. ఆ నినాదం సాధనకు మహిళలే ఉద్యమించి సాధించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకు పురుషాధిక్య సమాజం చేయూత ఇవ్వకుంటే తప్ప సాధ్యపడే పరిస్థితి లేదు. అయినప్పటికీ ఎందరో మహిళలు తమ ఔన్నత్యాన్ని చాటుకుంటున్నారు. స్వతహాగా తోచడమో, నాన్న, భర్త లేదా అన్నయ్య సాయంతో స్వయం సాధికారత సాధిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇలా ఎందరో వివిధ రంగాల్లో ఆకాశంలో సగం కావడానికి తమ వంతు స్ఫూర్తి నింపుతున్నారు. వారిలో ఓ ఇద్దరి ప్రగతిని పరిశీలిస్తే..

విద్యతోనే సాధికారత..



వుమెన్‌ ఎంపవర్‌మెంట్‌ను ఎక్కువగా నమ్ముతాను. విద్యతోనే మహిళలు సాధికారత సాధించగలరు. ఆమె అవివాహిత అయితే తల్లిదండ్రులకు ఆసరాగా ఉండడం, వివాహిత అయితే పిల్లలకు న్యూట్రిషన్‌, కుటుంబ వ్యవహారాలు, భర్తకు ఆర్థికంగా చేయూతగా నిలవడం చేయాలి. తోటి మహిళలకు తోడ్పడుతూ సమాజ పురోగతి సాధించాలి. మహిళలకు సమాజ, న్యాయ, పోలీసుల పరంగా ఎటువంటి సహకారం ఉంటుందో పత్రికల ద్వారా చైతన్యం కలిగించాలి. కుటుంబంలోని అబ్బాయిలకు అక్క చెల్లెళ్లతో ఏ విధంగా ఉండాలి, బయట మహిళలతో ఏ విధంగా ప్రవర్తించాలో తల్లిదండ్రులు తెలియజేయాలి.

– గూడూరు సుమతి, జాయింట్‌ కమిషనర్‌, వాణిజ్యపన్నుల శాఖ, కాకినాడ

అందం.. అద్దం అసూయపడేలా..



అందానికి మెరుగులు దిద్దడంలో దుబాయిలో శిక్షణ పొంది స్వదేశంలో ఉపాధి పొందాలనే లక్ష్యంతో నగరంలో లావిష్‌ స్కిన్‌ అండ్‌ హెయిర్‌, మేకప్‌ స్టూడియో స్థాపించా. తోటి మహిళలను ఆదుకోవాలనే ఉద్దేశంతో సుమారు 40 మందికి శిక్షణ ఇచ్చి తమ కాళ్లపై నిలబడేలా చేశాను. వారంతా దుబాయిలో స్థిరపడ్డారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని విజయాన్ని సాధించాలి.

– దీవీ లక్ష్మి, బోట్‌క్లబ్‌, కాకినాడ

కాకినాడ రూరల్‌: ప్రభుత్వానికి 80 శాతం ఆదాయం సమకూర్చే కీలకమైన వాణిజ్య పన్నుల శాఖ అధికారి ఆమె. పేరు గూడూరు సుమతి. వాణిజ్య పన్నుల శాఖ కాకినాడ డివిజన్‌ జాయింట్‌ కమిషనర్‌గా సమర్థంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ, వ్యాపార కుటుంబం నుంచి ప్రభుత్వ కొలువు సాధించిన ఘనత ఆ కుటుంబంలో ఆమె దక్కించుకున్నారు. అనంతపురం జిల్లా సోమందేపల్లికి చెందిన సుమతి తల్లిదండ్రులు వసంతలక్ష్మి, విజయనారాయణగుప్తా వ్యవసాయం, వ్యాపార రంగాల్లో స్థిరపడ్డారు. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నప్పటికీ సుమతి మాత్రం ఉద్యోగం చేయాలనే పట్టుదలతో ఎంబీఏ చేశారు. గ్రూప్‌ 1 పరీక్ష రాసి అసిస్టెంట్‌ కమిషనర్‌గా వాణిజ్య పన్నుల శాఖలో చేరారు. తరువాత డీసీగాను ప్రస్తుతం కాకినాడలో జేసీగా పనిచేస్తున్నారు. భర్త టీవీ రమేష్‌ వ్యాపారంలో స్థిరపడ్డారు. తాను నిజాయితీగా పనిచేస్తూ, సిబ్బందితో పని చేయిస్తూ విజయవంతంగా విధులు నిర్వహిస్తున్నారు.

11న క్రీడా ప్రావీణ్యుల కలయిక

నాగమల్లితోట జంక్షన్‌: జిల్లా ఒలింపిక్‌ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11న క్రీడా ప్రావీణ్యుల కలయిక నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి కె.పద్మనాభం మంగళవారం తెలిపారు. కాకినాడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పద్మనాభం మాట్లాడుతూ స్థానిక అర్బన్‌ తహసీల్దార్‌ కార్యాలయ ఆవరణలోని పెన్షనర్స్‌ భవన్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

వీధి వ్యాపారులకు లయన్స్‌ చేయూత

బాలాజీచెరువు: వీధి వ్యాపారులకు లయన్స్‌క్లబ్‌ కాకినాడ జెమ్స్‌ అండగా నిలుస్తుందని క్లబ్‌ జిల్లా పూర్వపు గవర్నర్‌ డాక్టర్‌ లింగమల్లు కృష్ణమూర్తి పేర్కొన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నగరంలో వీధి వ్యాపారుల రక్షణకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్‌ ప్రెసిడెంట్‌ నాగేశ్వరరావు, కార్యదర్శి నరసింహమూర్తి, పీఆర్‌ఓ కిరణ్‌ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ నియంత్రణపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

కాకినాడ క్రైం: జిల్లా ఎయిడ్స్‌ నియంత్రణ సంస్థ, వలంటరీ హెల్త్‌ సర్వీసెస్‌ సంయుక్త ఆధ్వర్యంలో రోటరీ మీటింగ్‌ హాల్‌లో మంగళవారం సమీక్షా సమావేశం జరిగింది. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్‌ ఆర్‌.రమేష్‌ హాజరై ఎయిడ్స్‌ నివారణ, నియంత్రణ చర్యలను పర్యవేక్షించారు. ఏఆర్‌టీ మందుల సరఫరాను పరిశీలించారు. బాధితుల నుంచి వ్యాప్తిని నిలువరించేందుకు చేపట్టిన చర్యలపై ఆరా తీసి, హెచ్‌ఐవీ పరీక్షల సంఖ్యను పెంచాలన్నారు. అంతకుముందు తుని ఏఆర్‌టీ సెంటర్‌లో గుండె పోటుతో మృతి చెందిన స్టాఫ్‌ నర్సు జయంతి చిత్రపటానికి నివాళులు అర్పించారు. సమీక్షకు వచ్చిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బృందం కోసం వలంటరీ హెల్త్‌ సర్వీసెస్‌ బృందం భోజన వసతి కల్పించారు. జిల్లా ప్రోగ్రాం మేనేజర్‌ ఆదిలింగంతో పాటు ఏపీ స్టేట్‌ ఎయిడ్స్‌ కంట్రోల్‌ సొసైటీ పరిధిలో పనిచేస్తున్న అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళనకు వామపక్షాల మద్దతు

కాకినాడ సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సీపీఎస్‌ రద్దు కోరుతూ గురు, శుక్రవారాల్లో నిర్వహించే ఆందోళనకు సీపీఐ, సీపీఎంల మద్దతు ఉంటుందని ఆ పార్టీల నాయకులు ప్రకటించారు. మంగళవారం ఆ నాయకులు సుందరయ్యభవన్‌లో ధర్నాకు వీలుగా నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. సీపీఐ నాయకులు బోడకొండ, తోకల ప్రసాద్‌, సీపీఎం నాయకులు ఎం రాజశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌..

వ్యక్తిపై బ్లేడుతో దాడి

కాకినాడ క్రైం: ఓ వ్యక్తిపై మరో వ్యక్తి బ్లేడుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన సోమవారం అర్థరాత్రి కాకినాడలో చోటు చేసుకుంది. బ్లేడ్‌ బ్యాచ్‌ ఈ పని చేసిందని ప్రచారం జరుగుతుండగా మానసిక స్థితి బాగోని తెలిసిన వ్యక్తే దాడి చేశాడని పోలీసులు అంటున్నారు. కాకినాడ సంజయ్‌నగర్‌కు చెందిన గజ్జి నారాయణ లారీ క్లీనర్‌. సోమవారం అర్ధరాత్రి అతడి స్నేహితుడు నీలాపు వీరకుమార్‌ తన జేబులో ఉన్న రూ.300 తీసుకోవాలని ప్రయత్నించగా నారాయణ నిలువరించాడు. దీంతో వీరకుమార్‌ తన వద్ద ఉన్న బ్లేడ్‌తో అతడిపై దాడి చేశాడు. స్థానికులు అతడిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వీరకుమార్‌ను పోర్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతంలోనూ వీరకుమార్‌ పలువురిపై దాడులకు పాల్పడ్డాడని, వైద్యుల సూచనలతో విశాఖపట్టణంలో ఉన్న మానసిక వ్యాధుల ఆసుపత్రికి తరలిస్తున్నట్టు పోలీసులు అన్నారు.

వ్యక్తిపై ఇటుకలతో..

కాకినాడ క్రైం: ఇంటి సరిహద్దు తగాదాలో ఓ వ్యక్తిపై ఐదుగురు వ్యక్తులు ఇటుకలతో దాడి చేశారు. వివరాల్లోకి వెళితే కాకినాడ దుమ్ములపేటకు చెందిన గరికిన గణేష్‌ మంగళవారం తన ఇంటి నుంచి కొత్త కాకినాడలో ఉన్న పిన్ని కోనాడి లక్ష్మి ఇంటికి వెళ్లాడు. అయితే లక్ష్మికి పొరుగువారికి ఉన్న సరిహద్దు ఘర్షణల నేపథ్యంలో అప్పటికే గొడవ జరుగుతోంది. గొడవలో తన పిన్నికి అండగా నిలబడ్డ గణేష్‌పై ఐదుగురు వ్యక్తులు ఎరిపల్లి శ్రీను, చొక్కా కాశి, కుందు పోలీసు, ముత్తి ఎల్లాజీ, చొక్కా వీరబాబు ఇటుకలతో దాడి చేశారు. ఈ ఘటనలో గణేష్‌ గాయాలపాలు కాగా లక్ష్మి కాకినాడ జీజీహెచ్‌కు తరలించింది. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో వ్యక్తికి జైలు

16 మందికి 10వేల చొప్పున జరిమానా

కాకినాడ లీగల్‌: కాకినాడ ట్రాఫిక్‌ పోలీసుల పరిధిలో మద్యం తాగి బైక్‌ నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకొని సోమవారం కోర్టులో హాజరు పరచినట్టు డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. మద్యం తాగి బైక్‌ నడుపుతున్న పెద్దాపురం మండలం జే.తిమ్మాపురానికి చెందిన వల్లూరి వెంకన్నకు నాలుగో అదనపు జ్యుడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ సీకేవీ సత్యకాంత్‌ వారం రోజుల జైలు, మరో 16 మందికి ఒక్కొక్కరికి 10 వేల చొప్పున జరిమానా విధించారు.

ఆయుష్మాన్‌ భారత్‌ వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్‌ నాగ నరసింహారావు

కాకినాడ: కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్‌ భారత్‌ను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ సీహెచ్‌ నాగనరసింహారావు కోరారు. స్థానిక స్మార్ట్‌ సిటీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఈ అంశంపై ఆయన సంబంధిత సిబ్బందితో సమీక్షించారు. ఆయుష్మాన్‌ భారత్‌ కింద గుర్తింపు పొందిన 82 వేల కుటుంబాలకు ఆరోగ్య గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ ప్రగతిని సమీక్షించారు. రానున్న రెండు మూడు రోజుల్లో ఈప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. ఇప్పటి వరకూ 65 శాతం ప్రక్రియ పూర్తి అయ్యిందన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్‌ పృథ్వీచరణ్‌, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్‌ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పన్నులు వసూలు చేయాలి..

ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని కమిషనర్‌ నాగనరసింహారావు ఆదేశించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులతో ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్‌ కోన శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.

ద్వారంపూడితో మర్యాదపూర్వక భేటీ

కాకినాడ: వైఎస్సార్‌ సీపీ అనుబంధ విభాగాల రీజనల్‌ కో ఆర్డినేటర్లుగా నియమితులైన నేతలు మంగళవారం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, ఏలూరు జిల్లా, బీసీ సెల్‌ ప్రాంతీయ సమన్వయకర్త అల్లి రాజుబాబు, యాదవ సంఘం ప్రతినిధులు, సీమాంధ్ర బీసీ సంఘ ప్రతినిధులు ఎమ్మెల్యే ద్వారంపూడిని కలిసి ధన్యవాదాలు చెప్పారు. అలాగే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వాణిజ్య విభాగం ప్రాంతీయ పరిశీలకుడిగా నియమితులైన పెద్ది రత్నాజీ ఎమ్మెల్యేని కలసి ధన్యావాదాలు చెప్పారు. పార్టీ నాయకులు రాగిరెడ్డి సుబ్బారావు, సుంకర విద్యాసాగర్‌, కర్రి వీర్రెడ్డి (చినబాబు), బాదం మధు, తదితరులు పాల్గొన్నారు.

9న రాష్ట్రస్థాయి ఫెన్సింగ్‌ జిల్లా జట్టు ఎంపిక

నాగమల్లితోట జంక్షన్‌: జిల్లా ఫెన్సింగ్‌ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫెన్సింగ్‌ పోటీలకు గురువారం జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి పీఎస్‌వీఎస్‌ ప్రకాష్‌ మంగళవారం తెలిపారు. స్థానిక రామారావు పేటలోని మున్సిపల్‌ స్కూల్‌ ఆవరణలో సాయంత్రం 4 గంటలకు ఎంపికలు ప్రారంభమౌతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు పదో తేదీన కాకినాడలో జరిగే అంతర్‌ జిల్లా ఫెన్సింగ్‌ చాంపియన్‌ షిప్‌పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారన్నారు. వివరాలకు 91540 15143 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వరుపుల రాజా మృతి బాధాకరం

బోట్‌క్లబ్‌: డీసీసీబీ మాజీ చైర్మన్‌ వరుపుల రాజా మరణం బాధాకరమని డీసీసీబీ చైర్మన్‌ ఆకుల వీర్రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో డీసీసీబీ పాలకవర్గ సభ్యులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సీతారామస్వామి ఆలయ హుండీల లెక్కింపు

బోట్‌క్లబ్‌: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి హుండీలను మంగళవారం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. 11 నెలల్లో రూ.1.15 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ బిక్కన వెంకటరాయచౌదరి తెలిపారు.

సాగరేశ్వరునికి విశేష పూజలు

కాకినాడ రూరల్‌: శ్రీసాగరేశ్వర భక్త బృందం ఆధ్వర్యంలో పౌర్ణమిరోజున సాగరేశ్వరస్వామి పార్థివ లింగానికి మంగళవారం విశేష పూజలు చేశారు. భక్త బృందం గురువర్యులు భవానీరెడ్డి, దుర్గాప్రసాద్‌ రెడ్డి ఆధ్వర్యంలో మండలం సూర్యారావుపేట సముద్రతీరంలో పౌర్ణమి పర్వదినాన్ని, లక్ష్మీదేవి జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు.